క్లుప్తంగా

వనదేవతలకు ఎమ్మెల్యే పూజలు



సమ్మక్క గద్దె వద్ద ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వనదేవతలకు సంప్రదాయబద్ధంగా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఖమ్మంపాటి రేణుక, ఘాజీ, బండారు శ్రీనివాస్, పూనెం లింగమ్మ, జోగ శేషగిరి, బండారు వెంకన్న, ఐలు నారాయణ, పచ్చిపాల రామ్మూర్తి, రాములు, రామకృష్ణ, తాటి ముత్తయ్య, సారయ్య, ముసుకుల మల్లేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని లేక్ వ్యూ పార్క్, శ్మశాన వాటిక పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ అంకుషావలీతో కలిసి చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ డీవీ మాట్లాడుతూ.. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారి వెంట 4వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ ఆజమ్, మాజీ కౌన్సిలర్ యలమందల వాసు, ఏఈ శంకర్ ఉన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ

పాల్వంచరూరల్: జగన్నాథపురం గ్రామంలో బహుజన పూజారుల శివస్వుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాబూరావు అధ్వర్యంలో శ్రీసంత్ సేవాలాల్, మేరమ్మ గుడి నిర్మించనున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నందనాయక్, గ్రామనాయక్ జాటోతు లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ అనిత, బాలాజీ, ఎంపీటీసీ ఉషాబాలు, గ్రామపెద్దలు ధర్మసోతు సీతారాం, సాధు జాటోతు శంకర్, సాదు హీమ్లా, ధర్మసోతు సక్రు, రాములు, భాస్కర్, శ్రీను, కుమార్, రమేష్, విజయ్, లక్ష్మణ్, శివ, నెహ్రూ, రాములు, బాలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

ఇల్లెందు: గర్భస్థ నిర్ధారణ పరీక్షలు నిర్వహించటం చట్టరీత్యా నేరమని, అనుమతి లేకుండా అల్ట్రాసౌండ్ మిషన్‌ను వేరొక చోటుకు మార్చినా చర్యలు తప్పవని డిప్యూటీ డీఈఎంఓ డాక్టర్ ఎండీ ఫజాయొద్దీన్ తెలిపారు. గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశానుసారం ఇల్లెందు పట్టణంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రులను, ప్రభుత్వ వైద్యశాలలోని స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ప్రత్యేక చొరవతో సీడీపీ నిధులు రూ.40లక్షలతో బేతంపూడి పంచాయతీకి 8 సీసీ రోడ్లు మంజూరు చేశారు. ఈ మేరకు గురువారం బేతంపూడిలోని ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఎదళ్లపల్లి బాబు గ్రామపెద్దలతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంగోతు లక్‌పతి, నూకల వెంకన్న, నానబాల భిక్షం, స్వామి, నగేష్ పాల్గొన్నారు.

డైరెక్టర్(పా)కు సత్కారం



బలరాంను సన్మానిస్తున్న శివకుమార్

కొత్తగూడెంరూరల్: సింగరేణి డైరెక్టర్(పా)గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన బలరాంను అంబేడ్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల శివకుమార్ శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ.. గతంలో సింగరేణి డైరెక్టర్‌గా బలరాం పని చేసి కార్మికుల సంక్షేమానికి కృషి చేసినట్లు చెప్పారు. ఆయన చేసిన సేవలు గుర్తించి, రెండోసారి డైరెక్టర్(పా)గా బాధ్యతలు అప్పగించటం గొప్ప విషయం అన్నారు. భవిష్యత్‌లో ఆయన సింగరేణి కార్మికులకు మరింత సేవలు చేయాలని కోరారు.

బీజేపీకి ఆదరణ

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీపై రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ అన్నారు. గురువారం రాత్రి రుద్రంపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత ప్రధానిదన్నారు. కార్యక్రమంలో రాయుడు నాగేశ్వరరావు, తరుణ్, మహేష్, రవిగౌడ్, బడే రమేష్, సత్యనారాయణ, స్వప్న, రామారావు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ

- వివిధ గ్రాంట్ల రూపంలో మండలానికి రూ.9.40 కోట్లు
- పనులు ప్రారంభించేందుకు ఇంజనీరింగ్ అధికారుల సన్నాహాలు



బాలాజీనగర్‌లో ప్రయాణానికి అనువుగా లేని అంతర్గత రహదారి

ఇల్లెందురూరల్: అడుగడుగునా గుంతలు.. తేలియాడుతున్న దుబ్బ, మొనలు తేలిన రాళ్లు.. వాటికితోడు చినుకుపడితే చాలు.. పల్లెల్లో అంతర్గత రహదారులు మరింత ఛిద్రమవుతున్నాయి. కాలు తీసి కాలు వేయలేనంతగా బురదమయమం ఇటువంటి పరిస్థితిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పల్లె రహదారులను మెరుగుపర్చాలని ఆకాంక్షించారు. కానీ పంచాయతీకి మంజూరయ్యే నిధులు ఇతరత్రా ఖర్చులకే సరిపోవడంతో పక్కా రహదారుల నిర్మాణం వారికి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. అప్పుడప్పుడు పలు గ్రాంట్ల పేరుతో పంచాయతీకి ఒకటి, రెండు సీసీరోడ్లు మంజూరైనా వారికి సంతృప్తి కలగలేదు. తమ పదవీకాలం మరో ఏడాదిలో ముగుస్తుందన్న సమయంలో పలు గ్రాంట్ల రూపంలో పల్లెల్లో సీసీ రహదారుల నిర్మాణానికి మండలానికి రూ.9.40 కోట్లు నిధులు రావడంతో సర్పంచ్‌లతోపాటు పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.2కోట్లు

ఎన్ఆర్ఈజీఎఫ్ పథకం ద్వారా గతంలో మంజూరైన నిధులను రెండు, మూడు గ్రామపంచాయతీలకే కేటాయించారనే విమర్శలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు సైతం ఈవిషయంలో పలు వేదికల నుంచి తమ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ దఫా మంజూరైన నిధులను అన్ని గ్రామపంచాయతీలకు కేటాయించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా ప్రతి గ్రామపంచాయతీకి కనీసం మూడు నుంచి నాలుగు రహదారులు ఉండేలా ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ జాగ్రత్తలు తీసుకున్నారు. మార్చిలోగా పనులు పూర్తి చేయాలనే నిబంధన ఉండటంతో పనులు ప్రారంభించేందుకు ఇంజనీరింగ్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచ్‌లు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఏటా తక్కువ సమయం ఉండటంతో పనులు హడావుడిగా చేస్తున్నారు.

పనులపై ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడుతుందనే ఆరోపణలు ఉన్నాయి. పనులలో నాణ్యతాప్రమాణాలు పాటించక, కనీసం క్యూరింగ్ కూడా సక్రమంగా లేక సీసీ రహదారులు అనతికాలంలోనే పగుళ్లొస్తున్నాయి. ఈ సారి రెండు నెలల గడువు ఉన్నందున ఈలోగా పూర్తి చేసేందుకు ఇంజినింగ్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు ఈసారి వెనుకాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

డీఎంఎఫ్ ద్వారా రూ.4.50 కోట్లు

సార్వత్రిక ఎన్నికలు మరో ఏడాదిలో నిర్వహించనున్నారు. ప్రస్తుత రాజకీయ సమీకరణాలు కూడా మందుస్తుకు సన్నాహకంగా ఉండటంతో క్షేత్రస్థాయిలో పనుల హడావుడి కూడా అంతేస్థాయిలో ఊపందుకుంది. ఈ క్రమంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ దఫా మండలానికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) ద్వారా రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. దీంతో మండలలలోని 29 గ్రామ పంచాయతీలలో సీసీ రహదారుల నిర్మాణానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా పనులు చేపట్టాల్సిన రహదారులను గుర్తించారు.

ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.2.90 కోట్లు

కలెక్టరేట్ ప్రారంభించేందుకు వచ్చిన సీఎం కేసీఆర్ జిల్లా ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ప్రధానంగా ప్రతి గ్రామపంచాయతీకి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయా నిధులను సద్వినియోగం చేసుకునేందుకు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు చేపట్టాల్సిన పనులపై గ్రామపంచాయతీ పాలకవర్గాల సమావేశాలు ఏర్పాటు చేసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నాణ్యత పాటిస్తేనే ప్రయోజనం...

గతంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా నిర్మించిన రహదారులపై ప్రస్తుతం రాళ్లు తేలియాడుతున్నాయి. సీడీపీ, డీఎంఎఫ్ పథకాలలో భాగంగా చేసిన రహదారులు సైతం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఈ దఫా భారీగా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకునేలా గ్రామపంచాయతీ, మండల పరిషత్ ప్రజాప్రతినిధులు, మండల పరిషత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు స్వయంగా పర్యవేక్షించి కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకుంటాం



తాము పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత ఇంత పెద్దమొత్తంలో నిధులు మంజూరు కావడం ఇదే తొలిసారి. నిధులను సద్వినియోగం చేసుకుంటాం. పనులు నాణ్యతతో జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటాం.
– వల్లాల మంగమ్మ, సర్పంచ్, సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ

పల్లెలకు వరం



ప్రభుత్వం పలు గ్రాంట్ల పేరుతో పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయడం పల్లెలకు వరంలా మారింది. గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి రహదారి మెరుగుపడేందకు ఈ నిధులు ఉపయోగించుకుంటాం. పనుల నాణ్యతను పర్యవేక్షిస్తాం.
– మెట్టెల శిరోమణి, ఎంపీటీసీ, బొజ్జాయిగూడెం

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారం



ప్రచారం చేస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: కేంద్రం, రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. కిన్నెరసాని, యానంబైల్ గ్రామాల్లో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా గురువారం జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మతాన్ని అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం, ప్రాంతాన్ని అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో కట్టా సోమయ్య, డాక్టర్ గుండా శ్రీనివాసరావు, బుడగం మోహన్‌రావు, బుడగం కిరణ్ పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్ర కరపత్రం విడుదల..

కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాయల శాంతయ్య, పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు హాథ్ సే హాథ్ జోడో యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని, నియోజకవర్గంలో కూడా పాదయాత్ర నిర్వహించాలని కోరుతూ అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొమ్మిడి మల్లికార్జున్, పైడిపల్లి మనోహర్, అంతోటి పాల్, కొండ వెంకన్న, బత్తుల వెంకటేశ్వర్లు, పల్లపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పాల్వంచ: సికిల్ సెల్, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం అందించేందుకు నేడు కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు అన్నారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీపీఎస్ ఉద్యోగులు, అధికారులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వెంపటి వెంకటేశ్వర్లు, సత్యరాజ్ స్టీవెన్, షేక్ సయ్యద్, శివరాం పాల్గొన్నారు.

'చలో మిర్యాలగూడెం'



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సుజాతనగర్: మార్చి 1, 2, 3వ తేదీలలో మిర్యాలగూడెంలో జరగనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోత్ ధర్మా పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మంగపేటలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా గుగులోత్ ధర్మా మాట్లాడుతూ.. మహాసభలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల తో పాటు, మన రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 1000 మంది మేధావులు, ప్రముఖులు, ఉద్యమకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జగన్, బీమారావు, హత్తీరాం, రామ, కిషన్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలను ప్రేమగా చూసుకోవాలి



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీలు

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న ఆయాలు (హెల్పర్లు) పిల్లలను ప్రేమగా చూసుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మార్కెట్ యార్డులో ప్రాజెక్టు పరిధిలోని టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పని చేస్తున్న ఆయాలందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయాలు అంకితభావంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. టీచర్లు నిర్వహించే ప్రీ స్కూల్ కార్యక్రమంలో పాల్గొనాలని, గ్రామంలోని ప్రీ స్కూల్ పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చూడాలని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పెరటితోట పెంచాలని అన్ని విధులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం ఆయాలతో ప్రాక్టీస్ చేయించారు. ప్రీ స్కూల్, పెరటితోట తదితర పనులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సక్కుబాయి, అనురాధ, యశోద, లక్ష్మి, నిర్మల, స్వరాజ్యలక్ష్మి, కలేరాబేగం, మూడు మండలాల ఆయాలు పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలివ్వాలి



ఇల్లెందురూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న పొదుపు సంఘాల మహిళలు



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న పద్మ

ఇల్లెందురూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రస్తుత రుణాలు రద్దు చేసి కొత్తగా వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ డిమాండ్ చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో గురువారం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను చిన్నచూపు చేస్తోందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పొదుపు సంఘాల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని, సంఘాలలోని ప్రతిసభ్యురాలికి రూ.20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అభయహస్తం పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని, స్త్రీనిధి బ్యాంకును గ్రామస్థాయిలోనే ఏర్పాటు చేయాలని కోరారు. మహిళలకు స్వయం ఉపాధి పథకాలపై శిక్షణ ఇచ్చి ఆ దిశగా యూనిట్లు నెలకొల్పుకునేందుకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలన్నారు. సెర్ప్‌లో పనిచేసే ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, బుక్‌కీపర్లు, గ్రామసంఘాల సహాయకులకు రూ.10వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రస్థాయి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, తుపాకుల నాగేశ్వరరావు, తోడేటి నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, పాడుగు నర్సింహారావు, జానకి, లక్ష్మి, తిరుపతమ్మ, ఉమ, ఈసాల పాపమ్మ, వాంకుడోత్ సరోజిని, సంతు, మోకాళ్ల కృష్ణ, జటంగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించాలని 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక సమైక్య గ్రూపులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో, మెడికల్ కళాశాలల్లో, కలెక్టర్ కార్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకునే ఉద్యోగాలలో డ్వాక్రా మహిళలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి చిన్న తరహా పరిశ్రమలకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పి.బానోత్, జానకి, మంగమ్మ, స్వర్ణలక్ష్మి, అజ్మీర భారతి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే వనమా

సుజాతనగర్: వేపలగడ్డ గ్రామంలో గురువారం జరిగిన వివాహ వేడుకకు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హాజరయ్యారు. చాపల వెంకటేశ్వర్లు కుమారుడు నవీన్-సింధు దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లావడ్యా సత్యనారాయణ, రెడ్డెం తులసిరెడ్డి, అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఇదే వివాహ వేడుకకు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎదురుపడడంతో కరచాలనం చేసుకున్నారు.

పలువురికి పొంగులేటి పరామర్శ..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేపలగడ్డ, సుజాతనగర్, రాఘవాపురం, సర్వారం గ్రామాల్లో గురువారం పర్యటించి పలు నూతన జంటలను ఆశీర్వదించడంతో పాటు పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో లింగం పిచ్చిరెడ్డి, ఆళ్ల మురళీ, తూం చౌదరి, లేళ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా జీవించేందుకే సంప్రదాయాలు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): ప్రతివ్యక్తి ఆదర్శంగా జీవించేందుకే మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని తెలగ రామవరం గ్రామంలో శ్రీ సీతారామ, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా కూనంనేని హాజరై మాట్లాడారు. విభిన్న సంస్కృతులకు గ్రామాలు నిలయాలుగా నిలుస్తాయని, నేర్పిన సంస్కృతి సంప్రదాయాలను ఆచరించటం అభినందనీయమన్నారు. ప్రజలను సన్మార్గంలో నడిచేందుకు ఆధ్యాత్మిక వైపు పయనించాలని తద్వారా మానవ సంబంధాలు మెరుగుపడతాయని పెద్దలు సూచించారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, వై.శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్‌రావు, సలిగంటి శ్రీనివాస్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అన్యాయం చేయొద్దు



గోడు వెళ్లబోసుకుంటున్న గంగపుత్రులు

ఇల్లెందు: ఇల్లెందు చుట్టుపక్కల పలు చెరువులను సొసైటీలుగా ఏర్పాటు చేసుకుని చేప పిల్లలను చెరువులలో పెంచుకుంటూ వాటి మీద ఆధారపడి జీవిస్తున్నామని గంగపుత్రులు అధికారులను వేడుకున్నారు. గురువారం మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు ఇల్లెందులోని గంగపుత్రుల భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అటు సభ్యుల నుంచి ఇటు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. లలితాపురం, నంబర్-8 చెరువులను 1962-63లో సొసైటీ ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు 72 మంది సభ్యులు ఇల్లెందు మత్స్య సహకార సంఘంలో సభ్యులుగా ఉన్నారు. వీరు ఆ రెండు చెరువుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. అయితే పంతులు నాయక్ తండావాసులు తమకే సొసైటీ ఇవ్వాలని పట్టుపడుతుండగా లలితాపురం, మొట్లగూడెం వాసులు కూడా సభ్యత్వం ఇవ్వాలని కోరారు. ఇరువర్గాల వాదనలు, ఫిర్యాదులు విన్న అధికారులు... ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో సుధాకర్, నవీన్, పి.శ్రీనివాస్, కుమార్, కోటి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దక్కే వరకు విశ్రమించం



నియామక పత్రం అందిస్తున్న కామేష్

పాల్వంచ: బహుజనులకు రాజ్యాధికారం దక్కే వరకు విశ్రమించేది లేదని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ అన్నారు. గురువారం వనమా కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. పోరాటాల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. బహుజన రాజ్యాధికారం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, దొరల పాలనతో ప్రజలు విసిగిపోయారని, చిన్నచిన్న రాయితీలు, సబ్సిడీలు ఇచ్చి బహుజన సమాజాన్ని బానిసలుగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం వనమా కాలనీ పోలింగ్ బూత్ కమిటీని ప్రకటించారు. బూత్ అధ్యక్షురాలిగా మాలోత్ భానుమతిని నియమించారు. కార్యక్రమంలో కేతిని కుమారి, పూనెం జ్యోతి, మంజుల ఆకుల పద్మ, రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గ సమావేశం

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ పాలకవర్గం గురువారం సమావేశమైంది. ఉపసర్పంచ్ యాకూబీ తన వార్డు సభ్యురాలిగా అనర్హత వేటు పడటంతో చెక్‌లపై రెండో సంతకందారు ఎంపిక కోసం సర్పంచ్ పాయం స్వాతి అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించింది. ఓటింగ్ పద్ధతిపై వార్డు సభ్యుడు రంజిత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు గ్రామపంచాయతీ తీర్మానాన్ని ఆమోదం కోసం జిల్లా పంచాయతీ అధికారికి పంపినట్లు ఎంపీఓ చిరంజీవి తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన గ్రామ ప్రజలు



గుండ్లరేవు గ్రామసభలో సర్పంచ్, కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

జూలూరుపాడు: గుండ్లరేవు గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రజలు గళమెత్తారు. గురువారం గుండ్లరేవు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోడా కైక అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మంచినీళ్లు రావడం లేదని, రోడ్డు మరమ్మతులు చేపట్టడం లేదని, సీసీ రోడ్లు నిర్మించడం లేదని, గ్రామ పంచాయతీ ఏర్పడి నాలుగేళ్లవుతున్నా అభివృద్ధి జరగలేదంటూ గ్రామ సర్పంచ్ కైక, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యలను గ్రామప్రజలు నిలదీశారు. ఈ సమయంలో సర్పంచ్ కుమారుడు కలుగజేసుకోవడంతో స్థానికులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన గ్రామసభలకు రాకుండా ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని సర్పంచ్ కుమారుడు గ్రామస్తులను ప్రశ్నించడంతో గందరగోళం నెలకొంది. సర్పంచ్ కుమారుడికి గ్రామస్తుల మధ్య వాగ్వాదం జరిగింది. సమస్యల గురించి సర్పంచ్, సెక్రటరీలను అడిగినా స్పందించలేడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. గుండ్లరేవు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ ఉన్న ఫెన్సింగ్ పోల్స్ ఉండగా వాటిని ఎందుకు తీయించారని పాఠశాల హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్లను అడిగినా సమాధానం చెప్పడం లేదని, ఎస్ఎంసీ కమిటీకి తెలియకుండా ఫెన్సింగ్, పోల్స్ అమ్ముకున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కారం కాకుండా గ్రామసభ నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏంటని ప్రజలు వెళ్లిపోయారు.

అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీ పూడిపోయింది



ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన నాళా పిచ్చిమొక్కలు పెరిగి పూర్తిగా పూడిపోయింది. సింగరేణి క్వార్టర్ల నుంచి వెలువడే మురుగు ఇదే కాలువ ద్వారా ఇందిరానగర్ మీదుగా బుగ్గవాగులో కలుస్తోంది. ప్రధాన కాలువలో పూడిక తీయకపోవడం, పిచ్చిమొక్కలను తొలగించకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు ఇళ్లలోకి చేరిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితిలో వేసవిలోనే మురుగు ఇళ్లలోకి చేరుకునేలా ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఇల్లెందురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రుద్ర నాగమణి,
ఇందిరానగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్ : 9381017770